క్లుప్తంగా

కామేశ్వరమ్మ సన్నిధిలో విశేష పూజలు



పామర్రు(పమిడిముక్కల): పమిడిముక్కల మండలం కూడేరు గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ ఆదిలక్ష్మీకామేశ్వరి అమ్మవారి ఉత్సవాలు ఆదివారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కామేశ్వరి అమ్మవారి సన్నిధిలో తొలుత విశేషంగా అభిషేకాలు, పూజలను నిర్వహించారు. అనంతరం ఆలయంలో సువాసనిలతో సామూహికంగా పూజలను చేశారు. దీంతో ఆలయ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా కావూరి వంశస్తులైన మహిళలు వయసు తారతమ్యం లేకుండా ప్రతీ సువాసనికి పసుపు, కుంకుమలతో విశేషంగా అలంకారం చేసి ప్రత్యేకంగా పూజలు చేశారు. ఆలయంలో వేద పండితుల వేద మంత్రాల నడుమ లక్ష్మీగణపతి హోమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.

వృద్ధాశ్రమానికి సరుకులు అందజేత



గుడివాడటౌన్: స్థానిక బైపాస్ రోడ్డులోని మమత వృద్ధుల ఆశ్రమానికి ఆదివారం నిత్యావసర సరుకులు అందజేశారు. గుడివాడ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కలపాల కిరణ్ తండ్రి మోజెస్ జ్ఞాపకార్థం సరుకులు అందించారు. సేవా కార్యక్రమాలు నిర్వహించాలనే సంకల్పంతో సరుకులు అందజేసినట్లు కిరణ్ తెలిపారు. కార్యక్రమంలో గుడివాడ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చిననారాయణరెడ్డి, నాయకులు కె.ఆంజనేయ ప్రసాద్, చుండూరి శేఖర్, వాకర్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మహా గాయని వాణీజయరాంకు నివాళి

పామర్రు: దొరకునా ఇటువంటి సేవ అంటూ శంకరాభరణం చిత్రం ద్వారా తెలుగు వారందరూ గుర్తు పెట్టుకునేలా తన ప్రతిభను చాటుకున్న మహా గాయని వాణీజయరాం లేని లోటు సినీ రంగానికి తీరనిదని పామర్రు ఎస్పీ బాలు కల్చరల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సొపాటి బెనర్జీ, వీరంకి బుల్లెయ్య ఆదివారం తెలిపారు. స్థానిక కార్యాలయంలో వాణీజయరాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. అసమాన్య ప్రతిభావంతురాలు, శాస్త్రీయ సంగీతంలో మేటి, లలిత సంగీతంలో సాటి అనిపించుకున్న మహా గాయని అకాల మరణం సంగీత ప్రియులను కలిచి వేసిందన్నారు. పద్మభూషణ్ అనే మహోన్నతమైన అవార్డును తీసుకోకుండానే మృతి చెందడం వాణీజయరాం అభిమానులను ఎంతో బాధించిందని చెప్పారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని నివాళు లర్పించారు. కార్యక్రమంలో సతీష్, శ్రీనివాస్, హరిబాబు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫేర్ వెల్



పామర్రు: స్థానిక అసిసీ హైస్కూల్‌లో ఫేర్‌వెల్ పార్టీ ఘనంగా నిర్వహించారు. హైస్కూల్‌లోని 9వ తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి విద్యార్థులకు పాఠాలను బోధించారు. విద్యార్థులందరూ ఉత్సాహంగా డ్యాన్సులు వేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలను బాగా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కోరుతూ వారికి పెన్నులు ప్యాడ్‌లను బహుమతిగా అందజేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిస్టర్ సునీచాకో, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కైకలూరు ఎమ్మెల్యే డీఎన్నార్



వరహాపట్నంలో ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

కైకలూరు: రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) చెప్పారు. సర్పంచ్ ఉప్పలపాటి నాగమణి, ఎంపీటీసీ పందు గాంధీ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వరహాపట్నంలో ఆదివారం జరిగింది. తీన్మార్ డప్పులతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి చర్చిలో ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మూడున్నరేళ్లలో ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన కుటుంబాలకు సంక్షేమ వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు.

అవినీతి రహిత పాలన

రాష్ట్రంలో అవినీతి రహిత పాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని డీఎన్నార్ చెప్పారు. ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గతంలో పింఛన్లు తీసుకున్న తర్వాత కొంత మొత్తం దళారులకు చెల్లించాల్సి వచ్చేదన్నారు. నేడు పెంచిన పింఛన్‌ను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వలంటీర్లు అందిస్తున్నారన్నారు. దళారుల వ్యవస్థకు చెక్‌పెడుతూ సంక్షేమ పథకాలను ఒక్క బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. ప్రతిపక్షాల మాటలను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని చెప్పారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకోని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, జెడ్పీటీసీ కురేళ్ల బేబీ, ఏఎంసీ చైర్‌పర్సన్ దండే పుష్పలత, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, ఏఎంసీ డైరెక్టర్ కొనాల అనిత, పీఏసీఎస్ అధ్యక్షుడు చవల రజినీకాంత్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ కార్యదర్శి చేబోయిన వీర్రాజు, ఉప సర్పంచ్ గంగుల ఆంజనేయులు, ఆర్బీకే చైర్మన్ కత్తుల రమేష్, సోషల్ మీడియా కన్వీనర్ కూనవరపు సతీష్, నాయకులు బోయిన శ్రీనివాసరావు, ఉప్పలపాటి జయదేవ్, అందుగుల యాకోబు, కోనాల జోషి, ఈదా శ్రీను, బూరుబోయిన శ్రీనివాసరావు, మండ నవీన్, బందా నారాయణ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు నవరత్నకుమారి, కాసులు, వసంతకుమారి, దుట్టా మణి, మరియమ్మ, మంగారావు, ఎంపీటీసీ సభ్యులు కొండయ్య, బాలమ్మ, ఎంపీడీవో రామలింగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలకు విశేష స్పందన





వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

పామర్రు: స్థానిక శివాలయం వద్ద విజయదుర్గ పాలి క్లినిక్ అధినేత యండూరి వెంకట భవాని గుప్తా, పామర్రు లయన్స్ క్లబ్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో గుంటూరు ప్రభుత్వ వైద్యశాల వైద్యులు కోలా విజయ్‌శేఖర్, వైద్య బృందం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. తొలుత శిబిరాన్ని వైద్యుడు విజయ్‌శేఖర్ ప్రారంభించారు. శిబిరంలో కంటికి సంబంధించిన రెటీనా పరీక్షలు, నీటి కాసుల పరీక్షలతో పాటు సుగరు, బీపీ పరీక్షలను చేశారు. 200 మంది పాల్గొని వైద్య పరీక్షలను చేయించుకున్నారు. వీరిలో 50 మందికి కళ్లజోళ్లు అవసరమని, 50 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. త్వరలో కళ్లజోళ్లు, ఆపరేషన్లు చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

ప్రతి శనివారం వైద్య పరీక్షలు

వైద్యుడు విజయ్‌శేఖర్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి వారికి ప్రథమ చికిత్స పట్ల అవగాహన కల్పిస్తామన్నారు. ప్రథమ చికిత్స గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని చెప్పారు. ప్రతి శనివారం మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు కంటి వైద్య పరీక్షలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు కె.చంద్రశేఖర్‌రావు, బైసాని నాగేశ్వరరావు, బొప్పన స్వర్ణలత, కె.రామదాసు, నవరత్నం, రాజేశ్వరి, వైద్య బృందం పాల్గొన్నారు.

400 మందికి వైద్యపరీక్షలు

ముదినేపల్లి రూరల్: స్థానిక వి.కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం పిల్లల వైద్యశిబిరంలో 400 మంది పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పిన్నమనేని కోటేశ్వరరావు ఎడ్యుకేషన్ అండ్ మెడికల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ శిబిరాన్ని మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు ప్రారంభించారు. శిబిరంలో విజయవాడ అంకుర హాస్పిటల్‌కు చెందిన వైద్యులు చెరుకూరి రోహిత్ కిరణ్, ఎస్.ఇందుశ్రీ, గుడివాడ ఉమా చిల్డ్రన్ హాస్పిటల్ వైద్యులు పిన్నమనేని రామకృష్ణ, పిన్నమనేని మాధవి పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరాన్ని స్థానిక గౌతమ్ విద్యాసంస్థల అధినేత కొత్తూరి వేణుగోపాల్ పర్యవేక్షించారు.

సింధు స్నానాలకు పోటెత్తిన భక్త జనం



కృత్తివెన్ను మండలం పెదగొల్లపాలెం వద్ద సింధు స్నానాలకు వచ్చిన భక్తులు

కృత్తివెన్ను: పవిత్ర మాఘమాసంలో పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం జరిగిన సింధు స్నానాలకు భక్తులు పోటెత్తారు. మండల పరిధిలోని పెదగొల్లపాలెం, చినగొల్లపాలెం, ఇంతేరు బీచ్‌ల వద్ద భారీగా ప్రజలు స్నానాలు ఆచరించారు. ఆదివారం కావడంతో యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో స్నానాలు చేసినట్లు అధికారులు తెలిపారు. యువత బీచ్ వద్ద వాలీబాల్, కబడ్డీ తదితర ఆటలతో సందడి చేశారు. స్నానాలకు వచ్చే భక్తుల కోసం సంబంధిత అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పెదగొల్లపాలెం బీచ్ వద్ద ట్రాఫిక్ నిలిచిపోయింది.

మంగినపూడి బీచ్‌లో..

కోనేరుసెంటర్: మచిలీపట్నం మంగినపూడి బీచ్‌లో ఆదివారం భక్తులు సింధు స్నానాలు ఆచరించారు. తెల్లవారు జాము 5 గంటల నుంచే భక్తులు బీచ్‌కు భారీగా తరలివచ్చారు. సముద్రంలో స్నానాలు ఆచరించిన భక్తులు అనంతరం దత్తాశ్రమంలోని 11 బావుల్లో పుణ్యస్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. సింధు స్నానాలను పురస్కరించుకుని భక్తుల రాకతో మంగినపూడి బీచ్ పోటెత్తింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. భక్తులకు అవసరమైన తాగునీరు, వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. సింధు స్నానాలను పురస్కరించుకుని బందరు సబ్-డివిజన్ తరఫున పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. బందరు డీఎస్పీ మాసూంబాషా బందోబస్తును పర్యవేక్షించారు. పంచాయతీ, సచివాలయ సిబ్బంది బీచ్ వద్ద శానిటేషన్ పనులను పర్యవేక్షించారు.



సాగర సంగమం వద్ద జల్లు స్నానాలు

సాగర సంగమం వద్ద జల్లు స్నానాలు

కోడూరు: కృష్ణమ్మ సముద్రంలో కలిసే పవిత్ర కృష్ణా సాగర సంగమం ప్రాంతం వద్ద భక్తులకు అధికారులు జల్లు స్నానాలకు ఏర్పాట్లు చేశారు. సంగమం వద్ద ఊహకందని లోతు ఉండటంతో పర్యాటకుల భద్రత దృష్ట్యా జల్లు స్నానాలకు శ్రీకారం చుట్టారు. ఆదివారం సింధు స్నానాలు ఆచరించేందుకు వచ్చిన భక్తులంతా జల్లు స్నానాలు చేశారు. సింధు స్నానాలకు వచ్చిన భక్తుల వాహనాలను పోలీసులు బీచ్ వద్దే నిలిపివేయడంతో మూడు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి భక్తులు సంగమం వద్ద స్నానాలు ఆచరించారు. తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా, ఈఓ యలవర్తి సుబ్రహ్మణ్యం, మత్స్యశాఖ ఎఫ్‌డీఓ వి.సత్యనారాయణ పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు.

పక్షుల కేంద్రంలో పర్యాటకుల సందడి



ఆటపాకలో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

కైకలూరు: పక్షుల కిలకిలరాగాలకు తోడు పర్యాటకుల కేరింతలతో ఆటపాక పక్షుల విహార కేంద్రం ఆదివారం సందడిగా మారింది. ఏలూరు, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు వచ్చారు. బోటు షికారు చేస్తూ పెలికాన్, పెయింటెడ్ స్టోర్క్ పక్షుల అందాలను వీక్షించారు. అనంతరం పక్షి నమూనా మ్యూజియంను తిలకించారు. పల్లలు చిల్డ్రన్స్ పార్కులో ఆటలాడారు. సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు. అటవీశాఖ సిబ్బంది పర్యాటకులకు కొల్లేరు పక్షుల విశేషాలను వివరించారు.

అ'పూర్వ' సమ్మేళనం



వేదికపై పూర్వ విద్యార్థులు

గుడివాడటౌన్: స్థానిక ఏలూరు రోడ్డులోని ఎస్ఎస్ఎస్ ఫంక్షన్ హాలులో పూర్వ విద్యార్థుల కలయిక ఆదివారం జరిగింది. పట్టణానికి చెందిన టౌన్ హైస్కూల్‌లో 1966 నుంచి 70 వరకు ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 53 ఏళ్ల అనంతరం కలుసుకున్న వారు చిన్ననాటి జ్ఞాపకాలను వృద్ధాప్యంలో నెమరు వేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఒకరి యోగక్షేమాలు మరొకరు పంచుకున్నారు. కాగా అప్పటి వారి ప్రధానోపాధ్యాయుడు ఏవీ రాఘవరావును సత్కరించుకోవడం తమకు ఎంతో ఆనందం కలిగించిందని పూర్వవిద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు దావులూరి సురేంద్రబాబు, ఏఎన్నార్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఎంవీవీ నాగిరెడ్డి, పట్టణ ప్రముఖులు పర్వతనేని ఆనంద్, నీలం మురళీకృష్ణారెడ్డి, మలిరెడ్డి రాఘవరెడ్డి, మృదులా రాణి, ఉషారాణి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కొండలమ్మ సన్నిధిలో చండీ హోమం



గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ ఆలయ ప్రాంగణంలో ఆలయ ఈఓ సురేష్ ఆధ్వర్యంలో చండీ హోమాన్ని ఆదివారం నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారి భక్తుల సర్వశ్రేయస్సు, ఆయురారోగ్యా ఐశ్వర్య అభివృద్ధికి ఈ హోమాన్ని చేపట్టారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడుల సమర్పణ..

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులను చెల్లించుకునేందుకు ఆలయంలో ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు బారులు తీరారు. దీంతో ఆలయంలో కోలాహలం నెలకొంది. అమ్మవారికి పాల పొంగళ్లను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్ తగు ఏర్పాట్లు చేశారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

మండవల్లి: శ్రీ నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువుదీరి ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారి సప్తమ వార్షికోత్సవం శని, ఆదివారాల్లో నిర్వహించారు. ఆదివారం ఉదయం మహాపాశుపత సహిత రుద్ర హోమం, మృత్యుంజయ హోమం వైభవోపేతంగా చేపట్టారు. చాగంటి శ్రీనివాస్ దంపతులు పీటల మీద కూర్చుని హోమం చేశారు. రాత్రి 7.30 గంటలకు దుర్గా, మల్లేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకుడు చాగంటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కనులపండువగా నిర్వహించారు. సోమవారం రాత్రి అమ్మవారి పుష్పోత్సవం జరుగుతుందని అర్చకుడు శ్రీనివాస్ తెలిపారు.

సుబ్బారాయుడికి విరాళం



విరాళం అందజేస్తున్న దాత

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి దాతలు ఆదివారం విరాళమందించారు. కలిదిండి మండలం లోడిదలంకకు చెందిన అరవపల్లి వెంకటేశ్వరరావు, నాగమణి దంపతులు అంతరాలయ ముఖద్వారానికి వెండితాపడం నిమిత్తం రూ.10,116 విరాళాన్ని అందించారు. దాతను ఆలయ అధికారులు అభినందించారు. ఆలయ కార్యాలయంలో చైర్మన్ శొంఠి నాగరాజు, సహాయ కమిషనర్ నేల సంధ్యకు దాత విరాళాన్ని అందజేశారు.

త్వరలో ఫ్లై ఓవర్ పనులు ప్రారంభం



గుడివాడలో అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడటౌన్: పట్టణ ప్రజల చిరకాల వాంఛ రైల్వే ఫ్లై ఓవర్ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) కోరిక మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సూచనలతో బందరు పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి చొరవతో పట్టణంలోని భీమవరం గేటు, బిళ్లపాడు గేటు రెండింటిని కలుపుకుంటూ ఫ్లై ఓవర్ నిర్మాణానికి అనుమతులు వచ్చాయి. టెండర్లు కూడా ఖరారయ్యాయి. రూ.317.22 కోట్లతో 2.50 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న ఈ ఫ్లై ఓవర్ నిర్మాణానికి గతేడాది డిసెంబర్ 3న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే కొడాలి నాని, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక పాల్గొని శంకుస్థాపన చేశారు. పట్టణానికి ప్రధాన రహదారి ఐన ఈ రోడ్డుపై ఫ్లై ఓవర్ నిర్మించాలంటే ట్రాఫిక్ మళ్లించాల్సిన పరిస్థితి. దీనిని దృష్టిలో పెట్టుకుని స్థానిక పెద్ద కాల్వ నుంచి మందపాడు గేటు వరకు 40 అడుగుల సీసీ రోడ్డు ఏర్పాటు చేశారు. రోడ్డు నిర్మాణం పనులు పూర్తికావడం, వారం రోజుల్లో రోడ్డును డిపార్ట్‌మెంట్‌కు అందజేస్తామని కాంట్రాక్టర్ హామీ ఇవ్వడంతో స్థానిక శాసనసభ్యుడు కొడాలి నాని నేషనల్ హైవేస్, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్, ఎలక్ట్రికల్, రెవెన్యూ, రైల్వే అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటికే ఖరారైన స్థల సేకరణ సొమ్ము చెల్లించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. స్థానిక బస్టాండ్ నుంచి పామర్రు రోడ్డులోని ప్రధాన రహదారిపై ఉన్న డివైడర్లు తొలగించాలని మున్సిపల్ అధికారులకు, ఇప్పటికే అమర్చి ఉన్న విద్యుత్ స్తంభాలను భద్రపర్చాలని ఎలక్ట్రికల్ అధికారులను ఆదేశించారు. అప్రోచ్‌రోడ్డు కొంత భాగం కూలింగ్ కొరకు నీరు పెట్టడం జరిగిందని అది పూర్తయిన వెంటనే ప్రధాన అప్రోచ్ రహదారి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ట్రాఫిక్ మళ్లింపునకు అడ్డంకులు ఉండకపోవడంతో వెంటనే నిర్మాణం పనులు ప్రారంభించడానికి అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ముందుగా బిళ్లపాడు వైపు నుంచి పనులు ప్రారంభిస్తే ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఉండవని, దీంతో పనులు మొదలుపెట్టాలని ఆయన సూచించారు. సోమవారం నుండే ఆయా సంబంధిత అధికారులు వారికి కేటాయించిన విధులు నిర్వహించడానికి సన్నద్ధం అవుతున్న నేపథ్యంలో 10 రోజుల్లో నిర్మాణం పనులు ప్రారంభిస్తామని కాంట్రాక్ట్ కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

ఏడాదిలో పూర్తి కావాలి

ఫిబ్రవరి 2024కు ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తిచేసి ప్రభుత్వానికి అందజేస్తామని కాంట్రాక్టర్లు తెలిపారు. అన్ని సమకూరితే ఏడాదిలో ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తవుతుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పనులు ప్రారంభం కావడం, ఆర్థిక వనరులు సమకూరటం, అనుభవం కలిగిన కాంట్రాక్టర్ పనులు కైవసం చేసుకోవడంతో ఏడాదిలో ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



పూర్తయిన అప్రోచ్‌రోడ్



శంకుస్థాపన చేస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే నాని, హారిక తదితరులు(ఫైల్)